క్లుప్తంగా

రేషన్ డిపో డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

రేగిడి: మండలంలో ఏడు రేషన్ డిపోలకు సంబంధించి ఖాళీగా ఉన్న డీలర్ల భర్తీ నిమిత్తం నోటిఫికేషన్‌ను తహసీల్దార్ ఎం.చిన్నారావు శనివారం విడుదల చేసారు. పుర్లి(ఎస్‌టీ), ఆడవరం(ఓసీ), పెద్దశిర్లాం(బీసీ–బీ ఉమెన్), బూరాడ (ఈడబ్ల్యూఎస్ ఉమెన్), కందిశ(ఓసీ ఉమెన్), కొత్తచెలికానివలస (ఎస్సీ), లచ్చారాయపురం (బీసీ–ఏ) డిపోలకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు వెల్లడించారు. ఈ నెల 26లోగా దరఖాస్తులను చీపురుపల్లి ఆర్‌డీఓ కార్యాలయానికి అందించాలని సూచించారు.

రైలు ఢీకొని మేకలు మృతి



రైలు ఢీకొనడంతో మృతి చెందిన మేకలు

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామ సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌ను దాటుతున్న పది మేకలను రైలు ఢీకొనడంతో మృతి చెందాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి చెల్లాచెదురైన మేకల మందలో 10 మేకలు ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందని, సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని, ఎమ్మెల్యే బేబి నాయన, అధికారులు ఆదుకోవాలని దిబ్బగుడ్డివలస గ్రామానికి చెందిన మేకల మంద యజమాని చెందిన కె.గంగులు కోరాడు.

భక్తి శ్రద్ధలతో బేడా సేవ



బేడా సేవ సందర్భంగా స్వామివారి ఊరేగింపు

బొబ్బిలి: పట్టణంలోని పురాతన రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసం సందర్భంగా బేడా సేవ నిర్వహించారు. ఆలయంలో స్వామి వారిని ఊరేగించారు. వేకువ జాము నుంచి చేపట్టిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యువత మత్తుకు బానిస కావొద్దు



సంకల్పం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

వంగర: యువత మత్తుకు బానిస కావొద్దని ఎస్‌ఐ షేక్ శంకర్ అన్నారు. మండల పరిధి అరసాడలో సంకల్పం కార్యక్రమం శనివారం నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తే ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చైతన్యవంతం చేశారు. కార్యక్రమంలో యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

రాజాం సిటీ: పట్టణ పరిధి శాణావీధిలోని రాజవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వాసవీ క్లబ్ మన రాజాం–సారథి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి రోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కిడ్నీ సమస్యలు, కీళ్ల సమస్యలు, థైరాయిడ్, గ్యాస్ట్రిక్ తదితర సమస్యలను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి గిరిధర్, వాసవీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఇతర నాయకులు



తెర్లాంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, మండల పార్టీ అధ్యక్షులు సత్యంనాయుడు తదితరులు

జన నేత జగనన్న

- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో నేతలు
- కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టిన శ్రేణులు
- వాడవాడలా సేవా కార్యక్రమాలు

జన హృదయ నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పలువురు నేతలు కొనియాడారు. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో పలుచోట్ల శనివారం పార్టీ శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అంతకు ముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్, పార్టీ ప్రజాప్రతినిధులు, సభ్యులు, శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: జగన్నాథవలసలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, సర్పంచ్ ప్రతినిధి వెంకటరావు తదితరులు



రాజాంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ తదితరులు



రేగిడి : సోమరాజుపేటలో జగన్‌మోహన్‌రెడ్డి వేడుకల్లో వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు తదితరులు



సంతకవిటి: ఎంపీపీ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, ఎంపీపీ సిరిపురపు మంజు తదితరులు



రాజాం సిటీ: బొద్దాంలో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

● న్యాయ సేవలపై అవగాహన అవసరం



మహిళలు న్యాయ సేవలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని బొబ్బిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి అరుణశ్రీ అన్నారు. తెర్లాం మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న బొబ్బిలి కోర్టు న్యాయమూర్తి మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకు ఎటువంటి న్యాయ సలహాలు కావాలన్నా 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సదస్సులో ఎంపీడీఓ రేగి రాంబాబు, ఎస్‌ఐ సాగర్‌బాబు, మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

– తెర్లాం

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శంబంగి లక్ష్మి

బొబ్బిలి రూరల్: తుఫాన్ కారణంగా గ్రామాల్లో చేరిన మురుగునీరు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ శంబంగి లక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన మండల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు శాఖల అధికారులకు ఎంపీపీ పలు సూచనలు చేశారు. మురుగు నీరు నిల్వ లేకుండా శానిటేషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. పరిశుభ్రమైన శుద్ధమైన తాగునీటిని అందించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఉపాధి పనుల ప్రారంభోత్సవాలకు సర్పంచ్‌లను దూరం పెడుతున్నారని ఇది సరికాదని శివడవలస సర్పంచ్ పిల్లా వసుంధర ప్రశ్నించారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ పి.రవికుమార్ స్పందిస్తూ ఇక ముందు అలా జరగకుండా చూస్తామన్నారు. అనంతరం వివిధ శాఖల పనుల ప్రగతిపై ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామంలో రామాలయం నిర్మించేందుకు గ్రామస్తులు శనివారం భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులంతా ఐకమత్యంతో గ్రామంలో రామాలయం నిర్మించేందుకు పూనుకున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన రామాలయాన్ని పూర్తిగా తొలగించి దాని స్థానంలో నూతనంగా రామాలయాన్ని నిర్మించనున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శంకుస్థాపన చేశారు.



రామాలయ నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన చేస్తున్న గ్రామ పెద్దలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు

గృహ నిర్మాణ శాఖలో కిరికిరి

సంతకవిటి: తాలాడ గ్రామంలో ఓ వ్యక్తి ఎటువంటి ఇల్లు నిర్మించకుండా బిల్లు ఎలా ఆయన ఖాతాలో జమ చేశారని తాలాడ ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడు గృహ నిర్మాణ శాఖ అధికారులను నిలదీశారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో సన్యాసినాయుడు మాట్లాడుతూ తమ గ్రామంలో ఓ వ్యక్తికి దశల వారీగా కొంత మొత్తం జమ చేశారని ఇదెలా సాధ్యమని ఏఈ కనకయ్యను ప్రశ్నించారు. దీనిపై ఆయన సమాధానం చెప్పలేకపోవడంతో మిగిలిన సభ్యులు కలగజేసుకొని మంచి ప్రభుత్వంలో ఇల్లు కట్టకపోయినా బిల్లులు వేస్తారా? అని ప్రశ్నించారు. ఉపాధిపై జరిగిన సమీక్షలో గోళ్లవలస ఫీల్డ్ అసిస్టెంట్ కొరికాన వినయ్‌కుమార్‌ను ఎలా తొలగించారని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు ఏపీఓ హరనాధరావును నిలదీశారు. సోషల్ ఆడిట్ చేసినపుడు వెలుగులోకి రాని అవినీతి, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎలా జరిగిందని ప్రశ్నించారు. గోవిందపురం సర్పంచ్ రాగోలు రమేష్ నాయుడు కలగజేసుకుని ఎవరో ఫిర్యాదు చేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే సంస్కారం కేవలం కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రారంభించారని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పండు పాపారావు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

51 యూనిట్లు రక్తాన్ని అందించిన జగనన్న అభిమానులు

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు రాజాంలో అంగరంగ వైభవంగా జరిగాయి. తొలుత పార్టీ కార్యాలయం వద్ద జగన్‌మోహన్‌రెడ్డి బర్త్‌డే కేక్‌ను మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు అభిమానులతో కలసి కట్ చేసారు. అనంతరం సన్‌రైజ్ ఆస్పత్రి వద్ద రాజాం రెడ్‌క్రాస్ పర్యవేక్షణలో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వందమంది అభిమానులు ఈ శిబిరంలో పాల్గొని 51 యూనిట్ల రక్తాన్ని అందించారు.



రక్త దాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, రాజాం ఇన్‌చార్జ్ డాక్టర తలే రాజేష్ తదితరులు

వాడివేడిగా మండల సమావేశం

బాడంగి: మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ప్రతిపక్ష సభ్యుల పాత్ర అధికార పార్టీ సభ్యులే పోషించి అధికారులను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మండల సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో చర్చించాల్సిన శాఖ పద్దులపై ఎంపీపీ అనుమతి ఇవ్వడంతో తెంటువలస సర్పంచ్ తెంటు చిరంజీవరావు మాట్లాడుతూ సమస్యలు చెప్పుకోవాలని వస్తే అధికారులే లేకపోతే ఎవరికి చెప్పుకోవాలని అసహనం వ్యక్తం చేశారు. రోడ్ల గుంతలు పూడ్చాలని ప్రభుత్వం చెబితే అధికారులు నామమాత్రంగా పూడ్చి చేతులు దులిపేసుకుంటున్నారని దుయ్యబట్టారు. బెల్టు షాపులు గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలిశాయని చెప్పారు. ప్రభుత్వ ప్రకటనలకు క్షేత్ర స్థాయిలో వాస్తవాలకు పొంతన ఉండడం లేదన్నారు. వైస్ ఎంపీపీ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు ఎందుకు పెడుతున్నారో...ఎక్కడ పెడుతున్నారో కనీసం ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆర్‌పీహెచ్ ఇళ్లకు బిల్లులు ఎప్పుడిస్తారని డీఈఈ అప్పన్నను పలువురు సభ్యులు ప్రశ్నించారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, హౌసింగ్ డీఈఈ అప్పన్న, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: కారాద గ్రామ పొలాల్లో వర్షపు నీటిలో వరికుప్పలు, మినప మొక్కలు

నిండా మునిగిన రైతులు

- వరి, అపరాలకు తీవ్ర నష్టం
- వ్యవసాయాధికారుల సూచనలు



రామభద్రపురం: ఎస్.సీతారాంపురంలో నీట మునిగిన మొక్కజొన్న పంట

తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ధాన్యంతో పాటు అపరాలకు తీవ్ర నష్టం సంభవించింది. మొక్క దశలో ఉన్న అపరాల సాగులో తుఫాన్ తీవ్ర ప్రభావం చూపింది. మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను ఆరంభంలోనే దెబ్బతీసింది. మరో వైపు వరి ధాన్యం కుప్పలు, బస్తాలతో ఉన్న ధాన్యం పలుచోట్ల తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం : నందబలగ సమీపంలో మొక్కజొన్న పంటలో వర్షపు నీరు



బాడంగి: పూడివలస గ్రామ పొలాల్లో నీటి ముంపుకు గురైన వరికుప్పలు



తెర్లాం: ఆమిటిలో నీట ముంపుకు గురైన మొక్కజొన్న, వరి చేను కుప్పలను పరిశీలిస్తున్న ఏఓ సునీల్‌కుమార్



రేగిడి : పనసలవలసలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ మురళీకృష్ణ



వంగర: కొప్పరలో మొక్కజొన్న పంటలో చేరిన వర్షం నీటిని పరిశీలిస్తున్న ఏఓ తట్టికోట కన్నబాబు

సంక్షిప్తంగా...

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘ ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ అభిమాని పూసర్ల నాగభూషణరావు ఆ గ్రామంలోని పిల్లలకు పుస్తకాలు, పెన్నులు శనివారం పంపిణీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని ఈ సేవాకార్యక్రమాన్ని చేపట్టారు. వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు.

పారాది ఆనకట్ట చైర్మన్‌గా సత్తిబాబు

బొబ్బిలి: బొబ్బిలి, బాడంగి మండలాల్లో సాగునీరందించే పారాది ఆనకట్ట ఆయకట్టు సంఘ ఎన్నికలు శనివారం ఆర్డీఓ కార్యాలయంలో జరిగాయి. ఈ ఎన్నికకు సంబంధించి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా పెంట సత్యనారాయణ, బేతనపల్లి రమణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిచే ఆర్డీఓ రామమోహనరావు ప్రమాణ స్వీకారం చేయించి ధృవపత్రాలు అందజేశారు.

మతవిద్వేషాలు రెచ్చగెట్టొద్దు



మాట్లాడుతున్న స్థానికులు

బొబ్బిలి: స్థానిక సిర్లిపోతన్న గుడికి ఎదురుగా కొద్ది అడుగుల దూరంలోనే ఉన్న ఖాళీ ప్రాంతంలో చర్చి నిర్మాణం చేపట్టేందుకు సన్నాహాలు చేయడం మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉందని స్థానికులు మండిపడ్డారు. శనివారం సాయంత్రం 13, 15వార్డులకు చెందిన ప్రజలు విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలంలో చర్చి నిర్మాణం ఏంటన్నారు. వివిధ దీక్షాధారులు పూజలు చేసుకునే ప్రాంతానికి పక్కనే చర్చి నిర్మాణం ఎంత వరకూ సబబన్నారు. అధికార యంత్రాంగం వచ్చి పరిశీలన చేసి ప్రజల మధ్య మత విద్వేషాలు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

రేగిడి: మండలంలో ఒప్పంగి, పోరాం గ్రామాల్లో శనివారం రైతు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నారావు మాట్లాడుతూ రైతులకు ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. రైతులు అడంగల్, 1బీలు సక్రమంగా లేకుంటే ప్రాథమికంగా సర్వే జరిపి ఆన్‌లైన్‌లో వచ్చేటట్టు చూస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

అపరాల పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలి

రాజాం సిటీ: మండలంలోని రైతులంతా అపరాల పంట సాగుపై జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. శనివారం మండల పరిధి పొగిరి గ్రామంలోని రైతులకు అవగాహన కల్పించడంతో పాటు పంట దశకు చేరుకున్న పెసరపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు పంటలో మొలకలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పంటకు ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయడంతో పాటు ముందస్తుగా ఎకరాకు 15 కేజీల యూరియా చల్లాలని తెలిపారు. ఏఓ ఎం.రేణుకాసాయి, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించండి

రాజాం: పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు తుఫాన్ వర్షాలు కారణంగా జాగ్రత్తలు పాటించాలని రాజాం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు సూచించారు. శనివారం ఆస్పత్రిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వరుసగా కురుస్తున్న వర్షాలు కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని వెల్లడించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. తమ ఇళ్లతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మిగిలిన ఆహార పదార్థాలు ఎక్కడికక్కడే పారవేయరాదని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, జలుబు, దగ్గు, జ్వరం వాటిల్లితే వెంటనే వైద్యులను సంప్రదించాలని వివరించారు.